

# సీసాల్లోగాలి

శ్రీ కవికొండల వెంకటరావు

నేను ఎక్కడికైనా ప్రయాణమై బయలుదేరితే, కోటొకటి తప్పకుండా తొడుక్కు వెడతా! ఆ కోటు యొక్క పెద్ద జేబుల్లో ఒకదానియందు జేబురుమాలు, ఒకదానియందు ఒక తెల్లని సీసాయున్ను, పైజేబులో కాగితమున్ను పెన్సలున్ను, లోపలజేబులో మనీపర్సున్ను పెట్టుకు వెడతాను.

అలాగానే మొన్నటిదఫా శ్రీరంగపట్నం వెళ్లినప్పుడు ఈ పరికరాలు అన్నీ తీసుకు వెళ్లాను. తిరుగ ఆ వూరినుండి వచ్చేటప్పుడు "పెద్దకాపు కొత్తగా ఎత్తైన, మేడ కట్టాడు, చూచి వెళ్లండీ" అని ఊరివారు అన్నారు., "మేడ ఊరంతకూ మహా ప్రాముఖ్యంగా కేంద్ర స్థానంగా కనబడుతూన్నప్పుడు, చూడకుండా వుండడం ఏలాగు! నప్పకుండా చూస్తాను" అని పెద్దకాపుతకు కబురుపెట్టి, అతనితోకూడా ఆ మేడ యెక్కి, చుట్టూచూచి మిక్కిలి ఆనందపరవశుండనై, అతగాణ్ణి అభినందించాను. ఏమని? "ఓయీ! మీ మేడమీదనుంచి చూస్తే ఎంతదూరమైనా కనిపిస్తుంది!" అని అన్నాను. అతను "దూరం చూడాలంటే ఈ మేడే అక్కర్లేదండీ! కొబ్బరిచెట్టు ఎక్కినా కనబడుతుంది" అన్నాడు. దాంతో నాకు ఆ ఊరనున్న ఎక్కడెక్కడి కొబ్బరిచెట్లూ లెక్కపెట్ట బుద్ధి పుట్టింది. అయితే అది ఆ వూళ్లో సాధ్యం కాని పని.

ఆదిలో ఆ వూరు అసలు పెద్ద విశాలమైన కొబ్బరితోటల ప్రదేశమైయుండ వచ్చును. ఇళ్లుకాని వాకిళ్లుకాని, అవసరాన్నిబట్టి అక్కడక్కడ చెట్లు చెరిపి, ప్రజలు ఇళ్లుకడుతూవచ్చి, దాన్ని ఒక ఊరుగా చేశారనుకుంటా. ఇప్పటికిన్నీ, అన్నిగాదులు, అన్నిలోగిళ్లు వెలిసిఉన్నా, మేడమీదనుంచి చూస్తూఉంటే, ఊరంతా,



కేవలం కొబ్బరిమావుల పందిరి అల్లుకుపోయివుందా అన్నట్లు కనబడింది. అయినప్పటికీ అక్కడక్కడ బాగా వెలితిగా వున్న స్థలాలు లేకపోలేదు.

ఎక్కువగా మాయింటివైపు చూచానో, ఆ యింటినంటి, పూర్వ కాలం నుంచీ వుంటూవుండిన మూడు కొబ్బరి చెట్లు ముఖ్యంగా కనబడలేదు. ఆ లోటు తలబోసికుంటూ, జేబులో ఉన్న సీసాయొక్క బిరడా ఊడిపోగా, చెయ్యి జేబులోకి పోనిచ్చి బిరడానొక్కుతూ, వెళ్లొస్తానని పెద్ద కాపు నుండివీడ్కోలు అందుకున్నాను. రోడ్డు పుచ్చుకున్నాను. జాముపొద్దెక్కింది. ఎండ అంత వేడీకాకుండా చల్లనా కాకుండా సమశీతలంగా కొండలమీదా చెరువులమీదా చెట్లమీదా చెలకలమీదా తెల్లగా శాంతివంతమై కనువిందొడగూర్చింది.

ఒక్క నిమేషంలో దగ్గఱగా ఉన్న 'బస్సుస్టేండు'కు చేరుకోగల్గాను. కాని మొదటి బస్సులో చోటు లేక, రెండవబస్సు వచ్చేవరకు అక్కడ ఉన్న ఒకానొక కాఫీహోటల్ బల్లమీద నీపెపట్టున కూర్చోవలసి వచ్చింది. అప్పటికప్పుడే పెసరట్ల పెనం పనిఅయి, పొయ్యీ పెనమూ కూడా చల్లారిపోయి ఉండెను. కాని పక్కనున్న మఱోపొయ్యి జాజ్వల్యమానంగా మండుతూ ఉండెను. ఆ పొయ్యిమీద పెద్ద మూకుట్లో, సగానికి పైగా నూనె కళపెళామంటూ వుంది. వండే అతడు, పకోడీలేమిటి, వడలేమిటి, గారెలేమిటి, పుణుకులేమిటి, అన్నింటినీ వేలువేలు వాయిలుగా తీస్తూ, పళ్లాలలోకి వేస్తూ, 'సర్వర్ల'ని ఎక్కడి పళ్లెం అక్కడ పంచమంటూ వున్నాడు. అంతట్లో ఒక ఆతడు, ఒక తెల్లనిచొక్కా తొడుక్కుని పైనొక శాలువాలాంటిది ఉత్తరీయంగా వేసుకుని, తనకుముందు వేఱుమనిషి వినయవినమ్రుడై దారిచూపిస్తూంటే, తిన్నగా వచ్చి, నేఁ కూర్చున్న కాఫీహోటల్లోనే ఎదరబల్లమీద కొంచెం దూరంలో ఆసీనుడయ్యాడు. అదేవేళకు ఒకానొక ముసలి రైతు ఎక్కడినుంచో వచ్చి నేనున్న బల్లమీద రెండవ చివర కూర్చున్నాడు. దారిచూపిన ఆసామీ కనుసన్నను 'సర్వర్లు' శాలువా మనిషిముందు నాలుగు పెసర పుణుకులు ఒక ప్లేటులో పెట్టి, మఱో ప్లేటులో అతనికోసమే నాలుగు ఆవడలు 'చెమ్చా' తీసి, 'చెమ్చా' సమేతంగా ఇచ్చే ఉద్దేశ్యంతో ఉన్నారు.

"నాకు చెమ్చా ఎందుకోయి? తీత ముంజె తీతముంజె, లోపలి నీళ్లుపోకుండా ఆపళంగా నోట్లో వేసుకు మింగేవాడికి?" అంటూ పుణుకుల ఫలాహారము పూర్తిచేసి, అర సెకనులో ఒక ఆవడ నాలికమీద వేసుకు చప్పరించేశాడు. మఱి అతణ్ణి తీసికొనివచ్చిన గృహస్థు ఆవడించేవాళ్లతో ఆయన కేమేమి కావాలో అన్నీ సుష్టుగా పెట్టండిఅంటూ, రైతుచేతి పిలుపున మా బల్ల చేరికకు వచ్చాడు. అదివఱకు అతడూ రైతూ అన్యోన్యం ఎఱిగివుండబోలు. రైతు అతణ్ణి ఇలా పలుకరించాడు. "మీ యింట్లో ఆడవాళ్లకు గాలి సోకిందనిఅంటూ దాన్ని వదిలించడానికి భూతవైద్యుణ్ణి తెప్పిస్తానన్నావుడవు. ఆయన ఈయనేనా ఏమిటి?" అన్నాడు. అవతలతను "అవును!" అన్నట్లు తలూపాడు. "గాలి ఆడదా మగవాడా?" అని రైతు అడిగాడు. "ఎవరో పేరంటాలుట! మా వూళ్లోనే సీసాలోకి ఎక్కించేశాడు" అని జవాబు. "ఆ సీసా అక్కణ్ణే పారేశాడా?" అని తిరుగ ప్రశ్న. "లేదు, కూడా తీసుకుపోతున్నాడు. అలాంటి భూతాన్ని తానే గాని భూదేవికూడా భరించలేదట" అని తిరుగ జవాబు. అదంతా విని నేను యాదాలాపంగా నా జేబులోవున్న బిరడాబిగించిన తెల్లటి సీసాను పైకితీసి అక్కడ బల్లమీద నాప్రక్కన పెట్టుకున్నాను. దాన్ని రైతు చూస్తూ "తమరూ భూతవైద్యులేనా?" అని అడిగాడు. నేను "మఱే" అని అందఱూ వినేలా "ఆయన చచ్చిన మనుష్యులయొక్క గాలిని సీసాలలోకి ఎక్కించి లకోటాచేస్తే నేను చచ్చిన చెట్లయొక్క గాలిని సీసాలలోకి ఎక్కించి లకోటా చేస్తాను" అన్నాను.

భూతవైద్యు డప్పటికప్పుడే ఆవడ పెరుగు మీసాల కంటుకుంటే ఇటూ అటూ తుడిచేసుకుంటూ, "ఏమండోయి! మీ రెవరో నాకు తెలియదుగాని-మీరు భూతవైద్యుల్ని గురించి అంత తేలిగ్గా మాటాడరాదు" అన్నాడు. అంటే నేను "మాటాడరాదు అని అనడమేనా? ప్రత్యక్షానుభవం ఏమైనా చూపిస్తారా?" అని అడిగాను.

"చూపించడానికి హోటల్ ప్రొప్రయిటరుగారు అంగీకరిస్తే, పందెం వేసి మఱీ నా మహిమ చూపిస్తాను" అన్నాడు ఆ భూతవైద్యుడు. "మఱి మీరు?" అన్నాడు పక్కరైతు అప్పటికప్పుడే "విస్కో" ఒక గ్లాసుడు పుచ్చుకుని నా వంకకు తీవ్రంగా చూస్తూ, "అతనేం చూపిస్తాడో ముందు చెప్పమనండి!" అన్నాను. "ఏమి చూపిస్తానా? భూతాన్ని పైకివదలి చూపిస్తాను! ఇక్కడిప్పుడు అమ్మకానికున్న రెండు మళ్ళ పకోడీలు, నెయ్యిగారెలు, పదివేల పుణుకులు, రెండువేల ఆంవడలు, మఱి నంజుఁనానుపులన్నవి లేకుండా పక్కా ఒక్క లిప్తలో కాజేస్తుంది. ఇంకా" అని అంటూ పప్పు రుబ్బే ఆడమనిషికేసి ఒక మాటుచూస్తూ-చుఱచుఱ మండుతూవున్న పొయిమీద చఱచఱకాగే నూనిలో గిరగిర తిరుగుతూ వేగే పకోడీలు పరికిస్తూ, "పందెం - ఒక్క నిమేషంలో ఆ పప్పంతా రుబ్బి సముద్రపు నురుగులా మాపించి, మధ్యమధ్య సలసలమనే నూనెలో తన చేయి ముంచి కఱకఱమనే పకోడీ ఆలా పైకెత్తి గొంతుకలో వేసికొంటుంది. నేను పట్టిన భూతం తమాషా చూడాలీ అంటే చూడండి" అన్నాడు. "మఱి మీ సీసాశక్తి?" అని కూడా సవాలు వేశాడు ఆ భూతాలవాడు.

"నేను బిరడా తీస్తే గంటకు 70, 80 మైళ్ళ స్పీడ్‌న, తుపాను చెలరేగి, ఈ పాకను పందిరిని, బల్లల్ని, రుబ్బురోళ్లను ఎత్తిపారవేయడమేకాకుండా, మండుతూ వున్న పొయిలోని అగ్నికణాలను రేగ్గొట్టి, చంద్రవనిప్పులుగా ఆకాశంమీదకు విరజిమ్మి ఊళ్ళకూళ్ళనే నాశనంచేసి పారేస్తుంది" అన్నాను.

అనడంతోనే పొయిదగ్గఱ కూర్చున్న హోటల్ ప్రొప్రయిటర్ స్వయంగా లేచి ఒక కప్పు టీ తయారుచేసి భూతవైద్యుడికిస్తూ, "తమరు నాకు డబ్బు నివ్వనక్కఱ లేదు. చల్లగా వెడితే చాలు" అనిచెప్పి, నా వంకకు తిరిగి "తమరున్నూ ఫలాహారం తీసికోండి ముందు. ఇవిగో గారెలు!" అని ఎనిమిది గారెలు ఒక ప్లేటులోపెట్టి తేబోయాడు. "గారెలు కావలిస్తే నాబోటిగాడు అప్పటికప్పుడు రుబ్బింపించి వాయతీయించుకు, బిళ్లబిళ్లలుగా పంపించి బొత్తాలు పెట్టించి, నూనెలో అలా జారేయించు, వేగుతూంటే "ఏమోయి ఇలా అవి వుంటెడు గుది గుచ్చి పడెయ్యి" అని తాజా సరుకు మజాగా ఆరగిస్తాడుగాని, నిలవ సరుకు తినడు" అన్నాను. "అబ్బే! ఇవన్నీ మీరు వచ్చాక వేసినవే! గరమ్‌గరమ్ సరుకే" అన్నాడు షావుకారు. అంతలో బస్సు వచ్చే జాడగా దుమ్ములేచింది. నేను లేస్తూ


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. వి. & కంపెని. "ఆయుర్వేదసమాశ్రమం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.

"నాకు ఏమీ అక్కఱలేదు - థాంక్ యూ! హోటల్ మాత్రం మఱింకొంచెం శుభ్రంగా తుడిపించి, సర్వర్లు మంచి తెల్లని చొక్కాలు తొడుక్కునేలాగు చూడు. సాసర్లు, గ్లాసులు, చెమ్చాలు బాగా కడిగించు. సరుకు బాగానే వుంది జిగ్ జిగ్ మంటూ" అన్నాను. రైతు "అరు బాగా చదువుకున్న మారాజులు కాబట్టి అంత ధైర్యంగా నాకు సలహా యివ్వగలిగారు. లేకుంటే ఇవ్వగలరా? నేను గళాసులోకి ఏదో ఊక వొస్తే-ఊక ఎక్కడనుంచి వస్తుంది? పిడకనుండి కాక! అని నేను సీదాకా ఫిర్యాదు చెయ్యక మరోదాంట్లోకి "కలరు" తిరగబోయించుకు తాగాను" అన్నాడు. అలా అతగాడు ఏమేమో అంటూనే వున్నాడు-నేను బస్సు ఎక్కి సురక్షితంగా ఇల్లు చేరుకున్నాను.

మర్నాడు మా నాన్నగారి ఆబ్దీకం. ఆబ్దీకం యథాశాస్త్రీయంగా పెట్టాను. కాని అనుర సంధ్య వేళకు జ్వరం తగిలింది. మంచమెక్కాను. 'రగ్' కప్పుకున్నాను. ఇంట్లోవాళ్ళతో "ఉండండి! మందు మాటకేం? ఆ బిరడా వున్న సీసా తీసుకు రాండర్రా ఇలా" అని తాఖీదు ఇచ్చాను. ఒక పావుగంటో అరగంటో వాళ్లు విద్దూరంగా నా ఆజ్ఞను గురించి ఆలోచించిన వారై "ఎందుకడిగానో" అని ఆ సీసా నాకు అందిచ్చారు. ఆ సీసా అందుకుని అందర్నీ కాస్సేపు దూరంగా పొమ్మని-బిరడా తీసి సీసాలోని గాలిని గురించి యోజింపసాగాను.

అసలు నే పెఱిగినప్పట్నుంచీ మా యింట్లో పెఱట్లో వున్న కొబ్బరి చెట్లు మూడేనా అని మొదట సందేహమేసింది. బాగా జ్ఞాపకం చేసుకుని-మా తండ్రి, పెద్ద పినతండ్రి, చిన్న పినతండ్రి-అని పూర్వులను తలపోసికొని, ఉండేవి మూడు కొబ్బరిచెట్లు, అని ఒక నిర్ధారణకు వచ్చాను. అయినా "పూర్వీకులు క్రమప్రకారం మొదట మా తండ్రి, తరువాత మా పెద్దపినతండ్రి, తరువాత మా చిన్న పినతండ్రి పోయారే-అలాగే క్రమం తప్పకుండా ఈ మూడు చెట్లూ నశించిపోయినాయా?" అనే ప్రశ్న కొంతసేపు క్లిష్టత కూర్చింది. "దానికేం! పోయిన వెనుకగాలి అన్నది విశ్వమందటిదీ, చరాచర కోటిదీ ఒకటేగాని దానికి మఱి ముందు వెనుకలంటూ లేవు" అనే తీర్మానాలకు అనతి కాలంలో వచ్చాను. అనంత కాలవాహినిలో పయనింపసాగాను. అలా పయనిస్తూనే నేను మంచంమీదుండగా, ఆ చెట్లకొక్క రూపాలు కళ్ళముందు సాక్షాత్కారం కాసాగినాయి. అవి సాక్షాత్కారమైనకొద్దీ మూడుమూడు వ్యక్తులుగా నిరూపణ గొన్నాయి.

అందులో ఒక చెట్టు నూదమొక్క. అనగా అక్కడే మొలిచి అక్కడే మట్టి అయిన కొబ్బరిచెట్టు. మొదలు చాలా సన్నంగా వుండేది. దానికి చుక్కావు అనే ఒకావును కట్టేసేవారు. ఆ ఆవు యొక్క పాలరుచి ఆ చెట్టునుపట్టివచ్చిందో, ఆ చెట్టు కాయలోని నీళ్లరుచి ఆ ఆవును బట్టి వచ్చిందో-రెండూ బహుమధురాలు! నేను తఱచు ఆ ఆవుకోసం దూడను విప్పినపుడల్లా దూడను లాగిపట్టి అన్నో యిన్నో గుమ్మ పాలు తాగేసేసి, చెట్టొంక చూచేవాణ్ణి, "ఎప్పటికైనా తాగలేకపోతామా ఈ చెట్టు కాయలోని నీళ్లు" అని. దూడల్ని పాలానికి తోలుకుపోయినప్పుడు మట్టమధ్యాహ్నము ఏలాగో ఒకటి రెండు కాయలు ఆ చెట్టువి తీయించుకు తాగేసేవాణ్ణి-కాయలు తీయడానికి మనిషి ఎక్కేటప్పుడు ఆ చెట్టు జవజవలాడిపోయింది. అంత సన్నం అంత పాటవం కలిగింది అది. ఆ చెట్టు మఱి లేదిప్పుడు!

రెండవ కొబ్బరిచెట్టు ఉత్తరానికి పడమరకు మధ్య మూలను వుండేది. అది కుంచం మానుకట్టిన మొలకను ఎక్కడనుంచో తీసుకొనివచ్చి మావాళ్లు పాతించి, పెంచిన నారికేళవృక్షంలా ఉండేది. మొదలు లావుగా చూపుతూ, క్రమంగా పైకి వెళ్లినకొద్దీ అదొక వాటంగా ఎదిగి, సూదిమొనగా చివర తేలి, సూదిమొన చివర జుత్తు విరబోసికొన్న మాదిరిగా వుండి, మట్టలు, ఆకులు, ఆ మధ్యను గెలలు, గెలల నిండా 'కాయలు గలది! కానీ ఒకళ్లూ దాని కాయలు నాయెఱికను తీయించిన జాడలేదు. కారణం దాని మొదట పెద్ద బోదిచేసి ఆ బోదిలోకి నిరంతరం నూతివాడకపు నీరు వచ్చేలా ఏర్పాటు చేశారు. కాబట్టి చెట్టెకాబలి అంటే బోదిమట్టెయ్యాలి. మఱి కొబ్బరికాయ నీళ్లల్లో చేపలుంటాయి అనో ఆ బోదిలో చేపలుంటాయి అనో ఎప్పుడు కొంగలువాలినా ఆ చెట్టుమీదనే వాలేవి! తెల్లనికొంగలు! అయితే కాయలు కిందపడ్డప్పుడు ఆడించి చూస్తే లోపల కురిడీలు బడబడ చప్పుడయ్యేవి. ఇంతకూ నీటిరుచి చూడవద్దా అని లోపల వుండేది-ఎట్టకేలకొకనాడొక కొంగ గట్టిగా పొడిచింది కాబోలు ఒక ముప్పేటకాయ ఊడిపడింది. ఆ కాయ కొట్టి నీళ్లు తాగి ముక్క చవిచూస్తునుగదా-అపూర్వమైన అత్యంతరహితమైన రసవరార్థంగా తోచింది. కాయ ఉరవు నిజంగా పట్టి చూస్తే పిల్లలకు పాఠం చెప్పే "గోళాకార" భూమ్యుపరితలం అంత వున్నట్టు తట్టింది. ఆ చెట్టూ లేదిప్పుడు!

మూడో చెట్టునుగురించి యోచిస్తున్నా. అది మాకచ్చిరాని యొఱికను వేసిన లేత మొలకలాగే జ్ఞాపకం వస్తూవుంది. కారణం అదివేటేటా ఎంత పెఱిగేదో మేమూ ఏటేటా అంతా ఎదిగాం అన్నట్టు ఎప్పుడూ ఒకే నిడివిగల గడవెట్టి ఆ చెట్టు యొక్క పుచ్చుల్ని, బొండాల్ని, ఏవి కావలిస్తే వాటిని పడగొట్టుకొంటూ ఆడుకుంటూ వాడుకుంటూ వుండేవాళ్లం. దాహం వేస్తే అదునుకు ఉపయోగపడేలా వుండేది ఆ కొబ్బరిచెట్టు. మఱీన్ని దాని ఆకులు అతి పచ్చగా, మిక్కిలి కళ్యాణవంతంగా ఉండి ఎక్కడలేని శోభ ఆ యింటికి చేకూరుస్తూ వుండేది. ఆ చెట్టూ లేదిప్పుడు!"

ఇలా అనుకుంటూ, "సీసాలో గాలి ఇంకా వుందా? అంతా అయిపోయిందా?" అని దీపం ముందుంచి చూచాను. "బిరడా, వెయ్యనంతసేపు పైగాలు లెస్సైనా సీసాలోకి ప్రవేశించి ఆ సీసాను నిత్యపూరణంగా చూపించగలదు" అని హెచ్చరిక గొన్నాను.

పోయిన మూడు కొబ్బరిచెట్లను తలపోస్తూ, ఇంత వ్రాశానే పోయిన మా తండ్రిని గురించి, ఆయన తమ్ములిద్దర్నీ గురించి ఎంత వ్రాయాలో అని అనిపించింది.

వారు శతాధిక ఎకరం కలిసి వ్యవసాయం చేసేవారు. ఇతరులకు లక్షలాది సలహాలిస్తూ అందుకు తగినట్టు కాగితాలు ఊళ్లోవారందఱికీ వ్రాయించి పెడుతూ వుండేవారు. పెద్ద కొబ్బరితోటవున్న ప్రదేశంకొనివుండాలి కాపురంవుండడానికి-అన్నాగా-ఊరంతా ఆదిని కొబ్బరితోటల మేలిమిసుగు వేసుకు క్రమం క్రమంగా దాన్ని తొలగించుకు వుండివుండాలి అని అందుకే ఆశ్చర్యం! ఇప్పుడా యింటినంటి ఒక్క కొబ్బరిచెట్టూ లేదు!

ఆలాగ్గానే వారు చేసిన మహా కమతమున్ను మటుమాయమైపోయింది. ముప్పైమందికి పైగా పాలికాపులుండేవారు ఆరోజుల్లో. ఇప్పుడు కలంపట్టి వ్రాస్తూ వుంటే

(13-వ పేజీ చూడండి)


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహవచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీ చికిత్స, కాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

# సీసాలో గాలి

(11-వ పేజీ తరువాయి)

ఒక్కొక్క పాలికాపు ఒక్కొక్క పోత విగ్రహంలా ఈనాడు నా కళ్లెదుట నిలబడుతూ వున్నాడు! బూరారామన్న, ఎఱ్ఱ కృష్ణుడు, ఆళ్ల నర్సయ్య, దాడి రుద్రయ్య, అతగాడి అన్నో తమ్ముడో మహాలక్ష్మి, సూరిశెట్టి కొండయ్య, ఎల్లపు సోమన్న, రాజన్న, నూకయ్య, హలికంశెట్టి గంగయ్య, కామయ్య, మరిడయ్య, తిరపయ్య, ఆడారి వెంకన్న, ఈ రాముమూర్తి, మజీన్నీ తోట దగ్గర కాపలివుంటే అప్పుడు, ఏతాం తోడుతూ నూతిలోంచి పాటే క్లిల్లాడి పాలుపితికే గోవిందు, గాదెలదొడ్డి తుడిచే మాలది పార్వతి, ఒకరేమిటి అనేకమంది ఇరవై నాలుగు గంటలూ రోజూ యజమానుల చెప్పు చేతల్లో మెలగేవారు. వాళ్ల భార్యలో, తల్లులో, అప్పచెల్లెళ్లో, ఎఱ్ఱమ్మ అని, కన్నమ్మ అని, ఒక నలభైమంది అమావాస్యకు పున్నానికి తట్టలేసుకు జీతం గింజలు పట్టుకుపోవడానికి గాదెబడ్డీ మెట్లనుండి, వీధి మెట్లదాకా లోగిట్లోంచి నడచి వెళ్లి తాళాలు తెమ్మంటూ వుంటే వాళ్లు ఇంట్లోవాళ్లా పరాయివాళ్లా అని అనిపించేది.

"ఇప్పుడేం చేస్తున్నావు?" అని ఒకణ్ణి మొన్న అడిగాను. "ఏముంది మా నాయనగారు పోయాక ఏడుంబేల కౌలు కొని సొంత వ్యవసాయం చేసుకుంటూ వున్నాను. కాని స్వతంత్రం వచ్చాక మన దేశం ఎంతగా బలుపు తిండితింటూ వుందో నాలాంటి, తంతుగరనే అయిపోయింది" అన్నాడు. "బండి వుందా?" అన్నాను. "ఉందిగాని పోలుగర్ర విరిగిపోయింది" అన్నాడు. "ఎడ్లు?" అన్నాను. "అవీ వున్నాయిగాని రెండింటికీ గాళ్లు తగిలాయి" అన్నాడు. అతని ముఖంవంక చూస్తును గదా నాకంటె మునీలివాలకంతో నెరిసిన జుత్తుతో మీసంతో కనిపించాడు!

సీసాకేసి చూచాను తిరుగ. ఇంకా గాలి పూరించుకునే వుంది-సంతల్లో మగాలీల దగ్గర కొన్న గిత్తలుండేవి. మజీన్నీ దుక్కిటెడ్లు ఇరవై కాళ్ల వుండేవి. పోతులు పదిహేను కాళ్ల వుండేవి, ఆవులు పది, గేదెలు అయిదు వుండేవి. పోతుల్లో ఒక జతబొబ్బిలి పోతులు! ఆవుల్లో ఒకావు వడమటావు! గేదెల్లో ఒకటో రెండో గడిడి గేదెలు! బళ్లు మూడుండేవి. నాగళ్లు మున్నైయుండేవి. ఇవిగాక పెంపుడుగాను గుపెనం వుండేవి. గుగ్గిళ్లదాలి వుండేది పడితి గోలాలుండేవి అయిదు. మజీన్నీ నట్టింట ఎక్కడ చూచినా ఉల్లిపాయలు, పెల్లపచ్చులు, పెరుగుచట్టిలు, నేతిముంతలు కనువిందువు గావించేవి. పాకుండలు, అర్నెలు, మినపసున్ని మా పొట్టలకు తెల్లారేసరికి నిత్య నైవేద్యాలు. మల్లెపందరి వొకటుండేది! అది ఎన్ని మొగ్గలు తొడిగేదో చెప్పలేను ఫాల్గుణంనుండి ఆషాఢందాకా ఏమేటా! దేనికైనా కరువు కాటకం ఒకప్పుడు కాకుంటేఒకప్పుడైనా వుండేదేమోగాని ఆ తీగల నాకు దూసినంతనే మొగ్గ తొడగడానికి ఆటంకమేమీ వుండేదికాదు. అలాగ్గానే శీతాకాలంలోని చేమంతి మడిని గూర్చి తలపోసినా! దాని పువ్వులు దండలు దండలుగా గుచ్చబడి మొక్కోటికి కోరుకొండలోని శ్రీరంగనాయకులవారి మెడ నలంకరించినప్పుడు తప్పకుండా అనిపించేది. ఆ స్వామివారొక్కరే ఆ దండలయొక్క వసిమికి తూకానికి తగినవాడని! కాదా పీతాంబరధారి!

—ఊవరి ఊరగాయలు పెట్టడమంటూ వస్తే, అట్టే లేదోట కవుల్దార్ గొల్లకోటి సుబ్బయ్య హవల్దార్‌లా వచ్చి పెద్దకత్తిపీటమీద కూర్చుని, భద్రయ్య చెలకలోని పెరిపీశెతూగే ఊరగాయల మామిడికాయలను తరిగేసేవాడు పూటన్నర! ఊరగాయల గూనలు ఒక వీథయుండేవి చిన్నా పెద్దా, చిట్టటుకుమీదనీ, పెద్దటుకుమీదనీ, గూటిలోనసీ, అడ్డంగోడమీదనీ! వదేశ్శనాటి పాత చింతకాయ పచ్చడికూడా ఒక్కొక్కకుండ అడుగున పెంకు నంటిపెట్టుకు పైకితీస్తే రాలనేది—"ఎందుకులెండి, కుండ పగులగొట్టకండి!" అని అడిగినవాళ్లు గోంగూరపచ్చడితోనో, తొలుకుముక్కల్లోనో తృప్తిపడి వెళ్లిపోయేవాళ్లు—మా పెద్ద మేనత్తగారి వూరినుంచి కన్నప్ప, మా చిన్న మేనత్తగారి వూరినుంచి గంగన్న ఎప్పుడైనా వచ్చేవారు. వచ్చినప్పుడు వాళ్లు తప్పకుండా మొదటివాడు గోధుమలమూట రెండవవాడు తేనెపాకం తెప్పాళా పట్టుకువచ్చేవారు. ఎందుకు? మావాళ్ళనుండి పొగాకు గరపాకో పదిచట్టలు పట్టుకుపోవడానికో, అరటిగెలలు బరువైనవో రెండు తీసుకుపోవడానికో!

సీసావంకకు చూచాను. ఇటూ అటూ పరకాయించాను. ఇంట్లో వాళ్ళందరూ నిద్రపోతూ వున్నారు. సీసాలో గాలి అలాగే వున్నట్టుంది. "ఓ! ఈ గాలి ఎలా పోతుంది. ఈ సీసాలోనుంచి?" అని నిమీలితాక్షుడై యోజించసాగాను. "నేను ఆ సీసాలోకి నా ఊపిరి వదిలితే తప్ప అందులో కెక్కినగాలి స్థలాంతరం కానేరదు" అని సమాధి విచింతనానికి వచ్చాను.

అయితే నేను నా ఊపిరి ఆ సీసాలోకి వదలినవెనుక ఆ సీసాకు బిరడా వేసేవారెవరు? రెండూ ఒక్కసారిగా జరిగేదెట్లా? "జరుగనేరవు! జరుగనేరవు! నా గాలి ఏ సీసాలోకి ఎక్కబోదు" అని అనుకుంటూ నిద్రించాను.

తెల్లారి చూచేసరికి సీసా మంచం క్రిందకు జారిపడి ముక్కలై వుంది. బిరడా ఎందుదేనో! వీథిలోకి తుడిచివేయబడిందో దానంతటదే ఎగిరిపోయిందో, మరి కనిపించలేదు. ★

---

తనగదిలో కూర్చున్నాడు. ఏదో వ్రాస్తున్నాడు. 'కడుపుతీపి' అని వ్రాశాడు. కొట్టేశాడు. 'కన్నకడుపు' అదీ కొట్టేశాడు. 'పిల్లలుఅంటే' అది కొట్టేశాడు. పిల్లలమీద ఓ కథ వ్రాద్దామని, తనప్రేమ ఆ కథ ద్వారా తెలియచేద్దామని 'పాపాయి' అని వ్రాశాడు. బాగానేవుంది శీర్షిక అనుకున్నాడు. ఇక వ్రాయటానికి కలం కాగితంమీద పెట్టాడు. మేనల్లుడు, కొడుకు గదిలోకి వచ్చారు, మూడు, నాలుగేండ్ల వాళ్లు యిద్దరూ. అటు ఇటు చూశాడు. ఓ సారి సావిట్లోకి వెళ్లి చూశాడు. అక్కడ యెవరు లేరు. గబగబవచ్చాడు. ఇద్దర్ని చెరో చంకన యెత్తుకొని హృదయానికి హత్తుకున్నాడు. 'రఘుకు బిళ్లలు కొని పెట్టావని కాదూ, మీకుకూడా కావాలన్నారు. మంచి మంచి మిఠాయిలు, కారప్పూస, బిళ్లలు, కొనిపెడతాగాని ఎవ్వరితో చెప్పకండి చెపితే కొనిపెట్టను.' అని వాళ్లిద్దర్ని కౌగలించుకొని ఆనందసముద్రంలో మునిగి వున్నాడు.

'రఘును యెత్తుకోవటం చూడక పోయినా, వీళ్లిద్దర్ని యెత్తుకోవటమున్నా చూస్తున్నాలేరా. ఎన్నాళ్లుదాస్తావు' అంది అక్క, కిటికీ చువ్వల్లోంచి తొంగిచూస్తూ. ★

గనోక్యూర్
అన్ని సెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి.